# అశోకవనిలో రాముడు

1969

బోయి భీమన్న

ప్రథమ ముద్రణ
1969

హక్కులు రచయితవి

వెల మూడు రూపాయలు

ప్రతులకు
సుఖేలా నికేతన్,
ఇర్రం మంజిల్ కాలనీ, ఐ.సి. 85,
హైదరాబాదు - 4

# వనద్వారం

''అయ్యగారు! అబ్బాయి కవిత్వం వ్రాస్తున్నాడు'' అన్నారు బ్రహ్మశ్రీ దాసరి నరసింహం గారు మా నాన్నతో, ఒక రోజు ఉదయం.

బహుశా, అది 1923 ప్రాంతం కావచ్చు. అప్పటికి నాకు 12 సంవత్సరాలుంటాయి. మా ఊరు మిడిల్ స్కూల్లో 5వ క్లాసు కాబోలు చదువుతున్నాను.

మా ఇంటి నిండా చాట భారతాలు ఉండేవి. మా వెంకన్నయ్య రంగం సబుర్లు చేసేవాడు. భారతం, భాగవతం, భక్త విజయం వంటి గ్రంథాలెన్నో బర్మా నుంచి తెచ్చుకొన్నాడు. అవి ఎక్కువ కాలం మా ఇంట్లోనే ఉండేవి. భారతం ఐదు సంపుటాలు. వాటి సైజు చేటలంతేసి ఉండేది. అందుకే వాటికి చాట భారతాలనేవాళ్ళో, యేమో! అవి నా కెక్కువగా తల కిందకు పనికి వచ్చేవి.

మా ఇంట్లో ఉండే ఇతర పుస్తకాలు – కాలజ్ఞాన తత్వాలు, వేమన పద్యాలు, శుద్ధ నిర్గుణ తత్వ కందార్థ దరువులు వగైరా, వాటినే నేను ఎక్కువగా చదువుతూ ఉండే వాణ్ని. మా నాన్న పాడుకొంటుంటే వింటూ ఉండేవాణ్ని. అదే ధోరణిలో నేనూ వ్రాస్తూ ఉండేవాణ్ని – ఒకటీ, అరా.

అలా –వ్రాసిన పద్యాలనో, గేయాలనో మా ఇంటికి తరచు వస్తూ ఉండే మా నాన్న శిష్యులికి చదివి వినిపిస్తుండే వాణ్ని. పాపం వాళ్ళు గురు పుత్రుణ్నని ఆ బోరుతో నా బోరు సహిస్తూ ఉండేవాళ్ళు.

మా నాన్న గొప్ప వేదాంతి. ఆయనకు ఉభయ గోదావరుల్లోను చాల మంది శిష్యు లుండేవారు. అందులో ప్రధానులైన కొద్దిమందిలో బ్రహ్మశ్రీ దాసరి నరసింహంగారొకరు. వారిది పశ్చిమ గోదావరి, పాలకొల్లు ప్రాంతంలో నీరుల్లిపాలెం గ్రామం. అక్కడి నుంచి వశిష్ఠ దాటి కాలి నడకను మా ఊరు రావలసి ఉండేది. అస్పృశ్యత ప్రబలంగా ఉన్న రోజులు కనుక, గుర్రపు బళ్ళలో ఎక్కనిచ్చేవాళ్ళు కాదు. మరొక రవాణా సౌకర్యం లేదు. అందువల్ల నరసింహంగారు ఐదారు మాసాలకొకసారి గురుదర్శనం కోసం మా ఊరు వచ్చేవారు. ఆయన అప్పటికే వృద్ధులు.

ఈ శిష్యులలో అత్యధిక భాగం హరిజనులే. తత్వజిజ్ఞాసతో బ్రహ్మోపాసన చేసేవాళ్ళు కనుక, అందరూ బ్రహ్మశ్రీలే. అలానే పరస్పరం పిలుచుకొనేవాళ్ళు, వ్రాసుకొనేవాళ్ళు. వాళ్ళ వేదాంత గోష్ఠులకు తరచు నేను కూడా వెళుతూ ఉండే వాణ్ని. ఆ పనీ, ఈ పనీ చేసిపెడుతూ ఉండే వాణ్ని.

''అబ్బాయి కవిత్వం వ్రాస్తున్నాడు'' అని వారు అనగానే, మా నాన్న అన్నమాట ఇప్పటికీ స్పష్టంగా నాకు వినిపిస్తూనే ఉంది. ''ఏడ్చాడు, వెధవ, గచ్చకాయా, పుచ్చకాయా కవిత్వమవుతాయా? వ్రాస్తే మహాభారతం లాంటి గ్రంథం వ్రాయాలి'' అన్నాడాయన.

2

నాటికి ఈనాడు - సుమారు 46 సంవత్సరాల అనంతరం అశోకవనిలో రాముడు అనే ఈ చిన్ని కావ్యానికి తుది మెరుగులు దిద్దుతున్నప్పుడు, దీనిని మాన్యమంత్రి శ్రీ దాసరి పెరుమాళ్లు గారికి అంకితమిస్తున్నప్పుడు, చిన్ననాటి ఈ ముచ్చటను స్మరించక తప్పదు. అందుకే దానినిక్కడ పేర్కొన్నారు.

ఆనాటి బ్రహ్మశ్రీ దాసరి నరసింహంగారి కుటుంబానికి చెందిన వారే నేటి మాన్యశ్రీ దాసరి పెరుమాళ్ళు గారు. వీరి తండ్రిగారి పేరు కూడ నరసింహం గారే. స్థానిక రాజకీయ రంగంలో మంచి పేరు ప్రఖ్యాతులున్నవారే వారు కూడ.

అయితే - ఆనాటి మా నాన్న ఆకాంక్ష నేటి ఈ కావ్యం అనడానికి వీలులేదు. ఆయన ఆశించిన దానిలో సహస్రాంశం కూడ కాదిది. ఆనాటికీ, ఈనాటికీ నడుమ దేశ కాలాదులలో వచ్చిన మార్పు భారత రామాయణాల వంటి మహాగ్రంథాల అవతరణకు అనుకూలమైనట్టిది కాదు.

భారత రామాయణాల వంటి మహా సాహిత్య సృష్టిని చెయ్యగల ఋషులు ఈనాడు లేరు. ఎవరైనా అందుకు సాహసించినా - చదివే తీరిక, ఓపిక నేటి మానవుడికి లేదు. ఆకలి, నిరుద్యోగం, తిండి వేట, పని రద్దీ - ఇవే పరమార్థంగా ఉన్న నేటి మానవుడి బ్రతుకులో భక్తికీ, బ్రహ్మోపాసనకూ టైం ఎక్కడిది? అంగట్లో కొనుక్కు తిని పరిగెత్తే వాడికి ఆలోచనా మృతం ఎలా సాధ్యం? అందుకే ఈనాటి

మాకు ఏ గచ్చకాయో, పుచ్చకాయో వండి వడ్డించడమే మహా కవిత్వమైపోయింది.

ఆకలి రుచి ఎరగదు. ఆధునిక సాహిత్యం రస మెరగదు.

ఇక, నా విషయం. మా నాన్నలోని బ్రహ్మోపాసన కరిగి నాలో రసోపాసనగా రూపం దిద్దుకొన్న దనుకోవచ్చు. శృంగార దృష్టితో తప్ప సృష్టిలో ఏ వస్తువునూ నేను మరో విధంగా చూడలేను. సృష్టి సమస్తమూ ఉమా శంకరుల, సీతారాముల, రాధాకృష్ణుల విశ్వశ్రేయో లీలగానే కనిపిస్తుంది నాకు. అశోక వనంలో రాముడు అనే ఈ కావ్యానికి కూడ మూల భావం అదే.

## 3

రావణ వధ అనంతరం, ఆ రాత్రి రాముడు ఎవరికీ తెలియకుండా ఒంటరిగా బైలుదేరి, అశోకవనం లోకి వెళ్ళాడు.

సీతను రావణుడు చెరలో ఉంచిన తోట అది. తోటలోని ప్రతిచెట్టూ, ప్రతి వస్తువూ రాముడికి స్వాగతం చెప్పింది. అతడి ఆత్మ గతంతో తాదాత్మ్యం పొందింది.

అంతకు ముందే సీత చెరవిడిపించబడి, సుగ్రీవుని సైనిక స్థావరానికి కొనిపోబడింది. రాముడొక్కడే ఆ రాత్రి ఆ తోటలో ఒంటరిగా తిరిగాడు. రకరకాల జ్ఞాపకాలతో, భావాలతో, బాధలతో సతమతమైనాడు. కన్నీరు కార్చాడు.

ఇదీ ఈ కావ్యం.

ఈ కావ్య భావన, వస్తువు, సన్నివేశం, వికాసం, విన్యాసం – సమస్తమూ నేను కల్పించుకొన్నవే. సరిక్రొత్తవే. రామాయణంలో లేనివి.

తాను అంతగా ప్రేమించిన అర్ధాంగి సీత, అంత కాలంపాటు లంకలో చెర అనుభవించిన అశోక వనాన్ని, ఒక్కసారి చూడాలని రాముడు అనుకొని ఉండడా? అనుకొని ఉంటాడనే నా ఊహ. ఈ ఊహే సరిక్రొత్తది. ఒకానొక శుభ క్షణంలో, నా మనస్సులో తళుక్కుమన్న మెరుపు ఇది.

ఈ ఊహ వాల్మీకి మహాశయుడి కెందుకు కలుగలేదో? బహుశా నా కోసమే ఆయన వదిలేసి ఉండవచ్చు.

## 4

"భీమన్నగారూ! రాముడు ఆ రాత్రి నిజంగా అశోకవనంలోకి వెళ్ళే ఉంటాడండీ! వాల్మీకి చెప్పకుండా ఎందుకు వదిలేశాడోగాని!'' అన్నారు – ఆంధ్ర యూనివర్సిటీ తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య డాక్టరు కె.వి.ఆర్.నరసింహం గారు – ఈ కావ్యాన్ని సాంతం విని.

నేను చేసిన ఈ ఊహ, ఈ కావ్య నిర్మాణం ఎంత క్రొత్తగా ఉన్నదో అంత సహజంగా కూడ ఉన్నదన్న ప్రశంస డాక్టరు నరసింహం గారి వాక్కులో ఉంది. సగోష్ఠి సహపంక్తి భోజనంతో, కమ్మని పొగచుట్టల సేవనంతో, రోజంతా లోకాభిరామాయణంతో – నరసింహం గారి ఆనాటి ఆతిథ్యం ఎన్నటికీ మరువరానిది. మధ్య మధ్య కావ్యాన్ని ఆలకించిన ఆయన ధోరణి సహృదయ సర్వాంగీణ మైనట్టిది.

లోకంలోని శోకాన్నంతా తానే భరించి, లోకానికి శోకోపశమనం కలిగించిన పూర్ణ స్త్రీ సీత. సీత చరిత్రే లోక చరిత్ర. లోక చరిత్ర శోక చరిత్రే కద?

నేను లోగడ వ్రాసిన శ్యమంతకమణి సాంత్వనం వంటిదే ఇది కూడ. దీన్ని శ్రీరామ సాంత్వనం అంటే అనవచ్చు.

ఈ కావ్యంలో రాముడు మాట్లాడడు. తోటలో తిరుగుతాడు. సూర్యుడి నుంచి కిరణాల్లా, అనేక భావాలు ఆయన మనస్సు నుంచి పుడతై. విశ్వం నిండా ప్రసరిస్తై. వాటిని అందిపుచ్చుకొంటూ నడిచింది ఈ కావ్యం. అంటే – రాముడి భావాలను, తదనుగుణమైన ప్రకృతి వర్ణనను గ్రహిస్తూ, వ్యాఖ్యానిస్తూ నడిచిందన్నమాట.

యుద్ధం ముగిసి, రావణ వధ అయి, సీతావిమోచన జరిగింది కనుక – పధ్నాలుగు సంవత్సరాల గడువూ కూడ గడిచింది కనుక – ముందు కర్తవ్యం గురించి కూడ రాముడు తర్కించుకొంటాడు.

నా కావ్యాలన్నిటి విషయంలో వలెనే, ఈ కావ్య సృష్టికి కూడ మూల బీజం స్నేహమే. ఒకానొక విచిత్ర స్నేహ సన్నివేశం. ఈ అపూర్వ భావాన్ని నాలో మెరిపించింది. కలం ముందుకు దూకింది.

ఈ కావ్యానికి రచనావకాశం అపరిమితం. ఎంతైనా వ్రాయవచ్చు. రాముని మరో వేదిక నుంచి మొత్తం రామాయణాన్నే గానం చెయ్యవచ్చు. నేను మాత్రం సీత – రాముడు – ప్రకృతి ఈ త్రికానికి మాత్రమే పరిమితం అయ్యాను. భావాలను, దృశ్యాలను మాత్రమే అంది పుచ్చుకున్నాను.

శూన్యం నుంచి భావం, భావం నుంచి శబ్దం, శబ్దం నుంచి దృశ్యం – ఇదీ నా సాహిత్య వ్యవసాయ ఫలసాయ క్రమం. ఫలసాయం శివార్పణం. శివ సరస్వతులది ఏక రూపం.

5

కవితకు ప్రాచీనత, ఆధునికత అనేదేం లేదు. అనాది నుంచి అనంతత్వం వరకూ అది ఏకస్రవంతి. నిరంతర జీవస్రవంతి. వేషంలో, విన్యాసంలో కొంత దేశ కాల పాత్రానుగుణమైన వైశిష్ట్యం గోచరించవచ్చు. అది బాహ్యమైందే. ఆంతరంగికమైంది కాదు. ఆత్మ ఎప్పుడూ ఒక్కటే. అది మానవ హృదయాన్ని స్వాదువు చేసే రసం.

అందుకే – వాల్మీకి నిత్యనూతనుడైన, నిత్యాధునికుడైన కవి. రామాయణం దైనందిన నిత్యజీవితం. నా ఈ అశోకవనంలోని రాముడు కూడ సార్వకాలికుడైన విశ్వమానవుడు.

దేశ కాల పాత్రలకు సంబంధించిన సాంఘిక దృష్టితోకాక – కేవల నిరపేక్షక దృష్టితో చూస్తే – మానవుడు తప్పు చెయ్యడనే నా సిద్ధాంతం. తప్పొప్పులు సాంఘికమైనట్టివి. అందుకే – రాముడు చేసిన ప్రతి పనినీ సమర్థించాను నేను.

ఒక్క మానవుడికే కాదు, ఏ జీవికైనా సరే – తాను బ్రతకడం అనేది ప్రాతిపదిక. దానిపై అతడి ప్రవర్తన, చర్యలు ఆధారపడతై. సహజ ప్రవృత్తిని సాంఘిక ప్రయోజనం దృష్ట్యా మలచుకోవడం విశిష్ట మానవ లక్షణం. రాముడు సర్వత్రా అందుకు అనుగుణంగానే వ్యవహరిస్తూ వచ్చాడు. ఆత్మ ప్రయోజనాన్ని సమాజ శ్రేయస్సుకు లోబరుస్తూ వచ్చాడు కూడ. వాలి, శూర్పణఖ వంటి వారి గాథల్ని కూడ సమర్థించాను నేను అందుకే.

ఆత్మరక్షణ చేసుకోలేని మానవుడికి – ఏ జీవికి కూడ – ప్రకృతి పురోగమన నిత్య సంరంభంలో స్థానం లేదు. ఆత్మరక్షణ ప్రధాన కర్తవ్యం. ఆత్మరక్షణ తర్వాత ఆత్మీయ రక్షణ. ఆ తర్వాత శిష్ట రక్షణ. శిష్టులంటే తన దృష్టిలో శిష్టులు. తన దృష్టి సార్వజనిక దృష్టి అయినవాడే మానవోత్తముడు. ఈ కావ్య రాముడలాంటివాడు. రాముడున్న పరిస్థితిలో ఉండే ప్రతి పురుషుడూ – అతడు ధీరోదాత్తుడైతే – ప్రతి విషయంలోనూ రాముడు ప్రవర్తించినట్లే ప్రవర్తించక తప్పదు. అందుకే అతడి ప్రతి పనికీ నా ఆమోదం.

ఒక మహోద్యమాన్ని, ఒక మహాయుద్ధాన్ని నడిపించి – విజయం సాధించిన వెనుక – ఒక్క క్షణం వెనక్కి తిరిగి, కార్యకారణ ఫలితార్థాలను వితర్కించి చూచుకొనే ప్రతి వ్యక్తి మనస్సూ ఏదో ఒక రసంతో పరిప్లావితం కాక మానదు. అట్టి రసం కరుణమో, శృంగారమో అయినప్పుడు – ఆ రసంలో ఆర్ద్రమైన చేతన ఆనందచేతనే – చేతస్కునితో తాదాత్మ్యం పొందగలదు. అట్టి స్థితిలో రాముణ్ని పరమాత్మస్థాయిని వర్ణించానందుకే. పరమ రసార్ద్రమౌగ్ధ్య స్థాయిలో ప్రతివాడూ రాముడే.

రామాయణ కాలంలో ఉండిన భారత రాజకీయ వ్యవస్థ – సర్వజన సమత్వంపై ఆధారపడినట్టిది. తద్విరుద్ధంగా కనిపించే సందర్భాలన్నీ ప్రక్షిప్తాలేననీ, కులతత్వం బాగా కరడుకట్టిన తర్వాత ఎవరెవరో ఆ మహాగ్రంథాలలో చొప్పించినట్టివేననీ నా విశ్వాసం. ఈ దృష్టితో చూచినప్పుడు నాకు రాముడు ఒక గొప్ప సోషలిస్టుగా కనిపిస్తాడు. వైదిక వ్యవస్థ సోషలిజమే. నా ఏక పద్యోపాఖ్యాన వ్యాఖ్యలో ఆ వివరాలన్నీ ఇచ్చాను. ఈ కావ్యంలో రాముణ్ని సంపూర్ణ మానవుడైన ఒక సోషలిస్టుగానే దర్శించాను.

## 6

''నాకొక్క కోరిక ఉందిరా. అది తీరదు.'' అన్నాడు మా నాన్న. కళ్లు తెరిచి మళ్ళీ మూసుకొంటూ, మా తమ్ముడు అర్జునుడితో.

''అదేదో చెప్పు. తీర్చడానికి ప్రయత్నిస్తాను...''

''నీవు తీర్చలేవు.''

''పోనీ, చెప్పగూడదా?''

''అన్నను చూడాలని ఉంది.''

అప్పటికి నేను మద్రాసులో ఆంధ్రప్రభ ఉప సంపాదకుడుగా ఉంటున్నాను. నాన్న మా తమ్ముడివద్ద మామిడికుదురులో ఉంటున్నాడు.

అది 1954, సెప్టెంబరు నెల. బహుశా, ఆశ్వయుజ బహుళ అమావాస్య. అప్పటికి ఆరు మాసాలుగా నాన్న అపస్మారంలో ఉంటున్నాడు. ఈ ప్రపంచం గురుతే లేదాయనకు.

ఆ రోజున హఠాత్తుగా తెలివిలోకి వచ్చాడు. దగ్గర ఉన్న వాళ్ళందర్నీ పిలిచాడు. మా తమ్ముడితో అనేక విషయాలు మాట్లాడాడు. తాను మరో వారం రోజులకు – కార్తిక శుద్ధ సప్తమినాడు – తెల్లవారితే శుక్రవారమనగా, ఆ తెల్లవారు జామున – తాను శాశ్వతంగా వెళ్ళిపోతున్నానని తెలియజేశాడు. ఆ సమయంలో ఏమి జరుగుతుందో ఆయన వర్ణిస్తున్నప్పుడు – భయాందోళనలతో వింటున్నారందరూ. అది నిజమో, అపస్మారపు మాటలో తేల్చుకోలేకపోయారు.

''గురువారం రాత్రి నన్ను వేరే ఒక గదిలో ఉంచండి. ఆ చుట్టు ప్రక్కల కెవ్వరూ రావద్దు. ఏవేవో శబ్దాలు, ధ్వనులు వినిపిస్తాయి. దుర్వాసనలు వస్తాయి. ఆ తర్వాత బాంబు ప్రేలినట్టు ఒక పెద్ద ధ్వని వినిపిస్తుంది, భయపడకండి. ఆ తర్వాత మధురమైన ఒక సువాసన వస్తుంది. అప్పుడు మీరు దగ్గరకు రండి. ఆ తర్వాత మీ కిష్టమైనట్టు అంత్యక్రియలు జరుపుకోండి. ప్రాణం పోయాక మిగిలేది మట్టి. దానికి ఎలాంటి సంస్కారమూ అక్కరలేదు. సంస్కారం వట్టి లోకాచారం.'' ఇవీ ఆయన చెప్పిన మాటలు.

ఏమిటి ఇదంతా?

ఆయన వేదాంతం ఆయనకంటే కూడా బాగా ఒంటబట్టిన మా తమ్ముడికీ, చివరి రోజుల్లో ఆయన సేవే తనకు సమస్తమూ అనుకొని గురుసేవ చేసిన శిష్యుడు బత్తుల పుల్లయ్యగారికీ కూడ ఇదేదో అయోమయంగానే కనిపించి ఉండవచ్చు. ఆ క్షణంలో నేనక్కడ ఉన్నా – ఆయన చెప్పిన మాట ఒక్కటీ నమ్మి ఉండే వాణ్ని కాదు.

ఇదంతా – చెప్పి – ఇదంతా ఇంత గొప్పగా చెప్పి – చివరికి తనకొక కోరిక

ఉన్నదనీ, అది తీరనిదనీ చెప్పడం ఎంత హాస్యాస్పదం! పైగా అది – తన పెద్దకొడుకును (నన్ను) చూడాలనుకోవడమంతటి చిన్న సామాన్యపు కోరిక!

''ఇదేనా నీ కోరిక? ఇదెందుకు తీరదు? నీవు దేహం వదిలేస్తానంటున్నది మరో వారానికి. ఇవాళే నేను వైరిస్తాను. రేపు బైలుదేరినా, ఎల్లుండికి అన్న ఇక్కడ ఉంటాడు.'' అన్నాడు మా తమ్ముడు. నవ్వాడు నాన్న.

''ఇదేరా, అనుభవానికీ, నేర్చుకొన్నదానికీ తేడా. నేను తెలివిలో ఇంకెంతసేపు ఉంటాను? మహా అయితే, మరో పది నిమిషాలు! ఆ తర్వాత మళ్ళీ సమాధిలోకి పోతాను. అక్కడి నుంచి అటే బ్రహ్మైక్యం పొందుతాను. నీవూ, నీ అన్నా, అక్కా, చెల్లెలూ, శిష్యులూ, స్నేహితులూ, సంఘమూ, లోకమూ అనేదేదీ నాకుండదు. నాకు సమస్తమూ సమత్వమే. ఇవేళ నీవు తంతి పంపితే – వెంటనే వాడు (నేను) బైలుదేరి రావచ్చు. అందువల్ల నాకు ప్రయోజనమేమిటి? వాడు నన్ను చూడగలడు కాని – నేను వాణ్ని చూడలేను కదా? వాణ్ని నేను చూడాలన్న కోరిక ఎలా తీరుతుంది? వాణ్ని అనవసరంగా రప్పించకు. నేను ఈ లోకంలో తెలివిలో ఉండేది మరో పది నిమిషాలు.''

తెల్లమొగం పెట్టాడు మా తమ్ముడు. వాడు నాకంటె తెల్లగా అందంగా ఉంటాడు కనుక – ఆ సంగతి నాన్నకు తెలిసిందో, లేదో! పెదవి విరిచి, ఆయన ఖచ్చితంగా కొన్ని భవిష్యద్విషయాలను వెల్లడించాడు. అందులో నాకు సంబంధించినట్టివి చాల ఉన్నై. మా తమ్ముడు మాత్రం వాటిని పొదుపుగా జరిగిన తర్వాత మాత్రమే చెపుతూ ఉంటాడు ''నాన్న చెప్పినట్టే జరిగింది'' అంటూ!

అంతా నాన్న చెప్పినట్టే జరిగింది. గురువారం రాత్రి, తెల్లవారితే శుక్రవారమనగా, బ్రహ్మ ముహూర్తంలో – నాన్న శివసాయుజ్యం పొందాడు.

శుక్రవారం ఉదయం ఆయన భౌతిక కాయానికి స్నాన సంస్కారం చెయ్యిస్తున్నప్పుడు -- తలంటుతున్న మా చెల్లెలు ద్రౌపది చేతికి (లేక, మా అక్క గౌంతమ్మ చేతికో) బ్రహ్మరంధ్రం చిట్లి ఉండడం తెలిసే వరకూ కూడ – ఆయన చెప్పిన ధ్వనుల, వాసనల అర్థం ఆయన శిష్యులకు కూడ అవగాహన కాలేదు!

ఇదంతా చెప్పడం ఇక్కడ అసందర్భం అని ఎవరైనా అనవచ్చు. అసందర్భమూ, అనౌచిత్యమూ, అసహజమూ అయిన ఒక్కమాట కూడ నా లేఖిని నుంచి వెలువడదు. నాన్న ఆ రోజున మా తమ్ముడికి వెల్లడించిన విషయాలలో నా సాహిత్య సేవా క్రమం కూడ సూచనగా ఉంది. అదే ఇక్కడ సందర్భం. నా చిన్నతనంలో నన్ను గురించి బ్రహ్మశ్రీ దాసరి నరసింహంగారితో నాన్న అన్న మాటకూ, దీనికీ ప్రకరణానుబంధం ఉంది.

అప్పటివరకూ నాన్న ఉన్నట్టిది అపస్మారస్థితి అనుకొన్నవాళ్ళు అది సమాధిస్థితి అని గుర్తించారు అప్పటికి. రాజయోగ స్వరూపాన్ని అంత స్పష్టంగా లోకానికి ప్రదర్శించి చూపాడు నాన్న.

"బోయి పల్లయ్య గురు - పుణ్య నామము దలప - జనన మరణ సంసార దుఃఖము తొలగు..." అంటూ, ఆయన శిష్యులు తమ వేదాంత కీర్తనల చివర ఆయన పేరును చేర్చి ఎందుకు పాడుకొనేవారో అప్పుడర్థమయింది నాకు. ఒక కౌపీనం, చిన్న అంగీ మాత్రం ధరించి తిరుగుతూ ఉండే నాన్న అంతటి మహాయోగి అని అంతవరకూ నాకు తెలియదు.

విశ్వకవి రవీంద్రుని మంత్రముగ్ధుని చేసిన నారాయణగురు ఆరోజుల్లో కేరళకు ఎటువంటి సేవ చేశాడో - మా నాన్న (పల్లయ్యగురు) తెలుగునాడుకు అటువంటి సేవే చేశాడనవచ్చు. కోస్తా జిల్లాల హరిజనుల్ని మతాంతరీకరణ ఉప్పెన నుంచి తన వేదాంత గోష్ఠుల ద్వారా కాపాడినవాడు నాన్నే.

7

ఈ కావ్య కృతి పతి మాన్యశ్రీ దాసరి పెరుమాళ్ళుగారు మా నాన్న శిష్యులైన బ్రహ్మశ్రీ దాసరి నరసింహంగారి వంశం వారు. వీరిదీ మొదట నీరుల్లిపాలెమే. తర్వాత వోడూరు వెళ్ళారు. రాజకీయంగాను సాంఘికంగాను ఆ ప్రాంతంలోని ప్రజలందరికీ అందుబాటులో ఉండడం అవసరమై - ఇప్పుడు వీరు పాలకొల్లులో స్థిరపడ్డారు.

కాకినాడ కాలేజీలో నాకు సహాధ్యాయి అయిన శ్రీ దాసరి బుల్లబ్బాయిగారితో నేను తరచు నీరుల్లిపాలెం వెళుతూ ఉండేవాణ్ణి. దాసరి వంశం ఎంతో సంపన్నమైనట్టిది.

''సిరులు పొంగిన జీవగడ్డ, పాలు పారిన భాగ్యసీమ'' వారి కుటుంబం. పాలు, పెరుగు, వెన్న, మీగడ – మినప సున్ని, గారెలు, నేయి – ఇదే అక్కడున్నన్ని నాళ్లూ మా ఆహారం.

అట్టి గొప్ప వంశంలో పుట్టి, ప్రజాసేవలో పెరిగి, నేడు అత్యున్నతమైన మంత్రి పదవిని అలంకరించిన మాన్యశ్రీ పెరుమాళ్ళుగారు హుందాతనంలో, ఔదార్యంలో, సాహిత్య పోషణలో, సరసతలో, సౌశీల్యంలో అత్యుత్తమ నాయకులు. అట్టి నాయకుడికి ఈ విశిష్ట కృతిని అంకితమివ్వగలుగుతున్నందుకు నేనెంతో గర్వపడుతున్నాను.

8

నా రచనలలో అక్కడక్కడ కనిపించే అఖండయతులు, విసంధులు, మైత్రి, వ్యావహారిక పదప్రయోగం వంటివి ఈ కావ్యంలో కూడ ఎడనెడ కనిపిస్తాయి. గ్రాంథిక భాషపై వ్యావహారిక భాషా ప్రభావం క్రమంగా ఎలా ఎక్కువవుతూ ఉన్నదో ఇవి సూచిస్తాయి. గేయం, నవల, నాటకం, కథ వంటి ప్రక్రియల వలెనే – పద్యం కూడ వ్యావహారిక భాషలో నడిచే కాలం ఇక ఎంతోదూరంలో లేదనవచ్చు.

- బోయి భీమన్న

సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి

## మాన్యశ్రీ దాసరి పెరుమాళ్లు గారికి

అల భోజరాజ, రాయలవారో కాకున్న
సాహిత్యపోషణ సాధ్యపడునె?
గౌతమ బుద్ధుడో, గాంధీ మహాత్ముడో
కాడేని, ప్రజ పట్ల కరుణయున్నె?
రాముడో, భీముడో, రాధా ప్రియుడో కాక
శ్రీ గూడి శక్తి వరించగలదె?
అమృతాకరుడో, వాని అబ్బయో కానిచో
పరహిత గుణవృత్తి పట్టుపడునె?

ఇందరును, మరి యెందరో ఇద్ధమతులు
ఎల్ల తమ శుభాంశలతో దీపించినట్టి
మధురమూర్తి మా పెరుమాళ్ళు మాన్యమంత్రి
మత్కృతీశుడు నిత్య సంపత్ ప్రభుండు!

–భీమన్న

## 1

రవిలిన వాడు, ఓడి తిమి
 రాబ్ధిని రాలిన వాడు, లోక బాం
ధవుడు - దశాస్య దానవ వ
 ధ (శ్రుతి నంత పునర్ జ్వలించి, తత్
ప్రవిరళ భావ వేగమున
 రాత్రికి రాత్రియె లేచి వచ్చెనో!
ఎవరది? రాముడా? వకుళ
 వృక్షము క్రింద అశోక వాటికన్?

## 2

ఒక్కడు, అర్ధరాత్రి; కను
 లుండియు లేని తమస్సు; చుట్టునున్
రక్కసి ప్రేతముల్ తమ ఉ
 రమ్ముల నెత్తురు తామె త్రావుచున్
క్రక్కుచునుంట; కంట దశ
 కంఠుని కాష్ఠము - ఔను, రాముడే!
ఒక్కడు, అర్ధరాత్రి, జ్వలి
 తోహలతో ఫలితాఖిలోహుడై!

## 3

అరిపురి తున్గి నెత్రుమడు
గై చన-త త్సరసీ స్ఫుటమ్ములా
కర చర ణాబ్జముల్, వదన
కైరవముల్, హృదయోత్పలమ్ములున్
విరవిరలాడె రాముడు ర
వి ప్రభ నట్లుదయింప! జ్ఞాన భా
స్కరు డుదయింప మిథ్య లగు
కాదె తమోగత సర్వ దంభముల్!

## 4

భారతి పాదపద్మముల
ప్రాపున దిగ్విజయోత్సవమ్ములన్
ఆరతి పట్టు పళ్ళెర మ
నన్ వికసించిన లంక - నేటి కే
హారతి పండెనో - ప్రమిద
యైనది రాఘవు డన్న జ్యోతి; క
ర్పూరె! జగత్తులే ఉపని
షత్తులు తచ్చరణ ప్రపత్తులన్!

## 5

ఎక్కడి వాడొ! ఏమికథొ
ఏ సతి కన్నదొ! ఏల వచ్చెనో
ఇక్కడి కిప్డు! సూర్యు డుద
యించును రోజును; కాని, ఇంతగా
చక్కని వాడు చిక్క డెదొ
సౌహృద ముండిన తప్పు; ఇప్పుడే
మ్రొక్కెద మంచు రాము పద
ముల్ స్పృశియించు వనిన్ తృణాదులున్!

## 6

కామన లేని లేమ, తన
కై తన సర్వము వీడుకొన్న శ్రీ
రాము, అమానుష మ్మగు చె
రన్ బడి కుందిన తావు చూడకే
రాముడు పోవ డంచు నిదు
రన్ విడి యున్న మహీజముల్ వెసన్
తామె మహీజలై కొలిచె
త త్పదముల్ ఫల పుష్ప సంభృతిన్.

## 7

రక్కసి చెట్లు రాము గని
రంగులు మారె; విభీషణమ్ము లై
మ్రొక్కె మహాగమమ్ము లల
మూడు జగమ్ముల కేక రూపతన్;
అక్కున చేరె శ్రీలతలు
ఆమని సంపద లెల్ల తామె య్యై;
చొక్కె మధువ్రతాలు, వని
శోభిలె రామపదాభిరామమై!

## 8

ప్రొద్దుట లేచి కోటి శివ
పూజలు చేసియ కాని ముట్ట డే
చద్దియు రావణుం; డతని
శక్తికి మించిన దైవ ముండెనే?
త ద్దమనేశ్వరుండు గురి
తప్పిన అ మొక్కదాన గూలె పో!
హద్దును మీరినప్పు డది
యంతల శక్తియు గడ్డిపోచ యౌ!

## 9

అడలున రావణాసురుని
ఆఖరుశీర్షము తున్గి నేలపై
పడ, దివి చల్లినట్టి పువు
వానల మొగ్గలు చెట్లలోన చి
క్కడి, అటె ఉండి, ఇప్పు డవి
ఔదల లొంచగ రాలె రాముపై-
పుడమిజ తొల్లి చల్లిన పు
వుం దలబ్రాలను జ్ఞప్తి చేయుచున్!

## 10

మహి దనుజత్వమున్ దునిమి,
మానవతన్ నిలుపన్, మహీజగా
సహనమె మూర్తి తాల్చినది;
చచ్చిరి రావణుడున్, తదాప్తులున్;
అహితము చచ్చెనా? నరుని
ఆత్మను పట్టిన పాము విచ్చెనా?
మహికి, మహీజకున్ తిరిగి
మంచి దినమ్ములు వచ్చెనా? ప్రభూ!

## 11

రావణు డీల్గె నన్న భళి

రా యను, కా దదె లేచె నన్న ఓ

హో, వహవా యనున్ – చివరి

యుద్ధము దన్కను లంకలో ప్రతీ

జీవియు ప్రాణవాయు వర

చేతను బెట్టుక; కాని – ఇప్పుడో?

భావ వసంత మయ్యె! తరు

వల్లులకున్ సుళు వయ్యె కంఠముల్!

## 12

వకుళము నయ్య, తండ్రి! నను

వంజుళమో అని చేర వచ్చినా

వొకొ? నడుమన్ కుజుం జనుప

కున్న నిజానికి మే మొకండె; బ్ర

హ్మకు మతిలేక చేయు నిటు

మాదిరి చేతలు; కాక – జానక

మ్మకు గతిలేకనా చెరను

మ్రగ్గుట? నీకును చేతగాకనా?

## 13

శివు విలు నుండబద్ద వలె
చేకొని, వింటికి తానె అల్లెత్రా
డవు నన నిల్పి, ఆడుకొన
దా జనకాత్మజ చిన్ననాడు? తత్
జవ మెట బోయెె? నీ కొరకు
తాళిన దంతియ! ఒక్క మంటి పె
ల్ల విసిరి ఆమె లిప్త కొక
లక్ష దశాస్యము లూడగొట్టదే?

## 14

కంటిని బాలగా మిథిల;
కంటి నయోధ్యపురిన్ నవోఢగా;
కంటిని చిత్రకూటి సతి
గా; ప్రియురాలుగ పర్ణశాలలో;
కంటిని భద్రగా, బగళ
గా, భువనేశ్వరిగాగ లంకలో;
ఒంటరి కాదు రామసతి;
ఉంటిమి మేమును త త్పదాళిగా!

## 15

చల్లని వెన్నెలల్ కురిసి
జారిన తారలు నవ్వుకొంచు పా
ల్వెల్లిని తేలివచ్చి అట
వెల్వడునో అన - గౌతమీ తటో
త్ఫుల్లము లైన మా పొగడ
పూలకు తా వగు వేణి - చిక్కి శో
కిల్లుచు నుండ, చూచి, దరి
కిన్ జనమైతి మ దేమి కర్మమో!

## 16

సుఖములలోన పాలుగొను
చుందురు, దుఃఖము లుప్పతిల్లినన్
ముఖమును కూడ చూప, రటు
మోస్తరు చుట్టము లైతి మేము - దు
ర్నఖ ముఖ మూర్ఖ రాక్షస గ
ణ క్షత సీతను గొల్వలేక! స్వ
శ్శిఖరము లంటె తత్ చరణ
సేవ నశోక మపాస్త శోకమై!

## 17

హింసను హింసచేతనె జ
యించక తప్పదు; దుష్ప్రవృత్తి వి
ధ్వంసము కాక తప్పదు; ప్ర
పంచములో ప్రతిజీవి మాన వో
త్తంసము కాక తప్పదు; చి
దాత్మకు అభ్యుదయమ్ము తప్ప; దా
శంసన నీదెగా! భువన
శాంతికి కేంద్రము నీవెగా! ప్రభు!

## 18

సీతను చూతుమా, సకల
సృష్టియు తా ననిపించు; రామునిన్
చూతుమ, సృష్టియే అతని
శోభన మౌ ననిపించు; ఇర్వురున్
చేతికి చేయి చేర్చుకొని
చేత మిగుర్ప అశోకధాత్రికిన్
ప్రీతి యొనర్తురా? తిరిగి
ప్రేయము శ్రేయము కూడిసాగునా?

## 19

రూపము లేనెడన్ మదికి
రూప మొసంగెడి సీత, రూపునన్
దీపము లేనెడన్ తెలిసి
దీపమె తా నగు సీత, ఏ విధిన్
తాపము లేని సీత, పతి
ధర్మ పథమ్మున దైవికమ్ములా
లోపము లెల్ల తానె గొని
లోకము నోర్చిన సీత – నాతియే?

## 20

త్యాగము రూపుగొన్న పర
మార్థ సరస్వతి, రాక్షసాటవిన్
సా గొనరించి సాత్విక మొ
నర్చిన చేతన ధార, మానవో
ద్యోగ పథాన మాధవ ప
దోన్ముఖి యైన వసంత లక్ష్మి, శ్రీ
భూ గురు శక్తి సీత పరి
పూర్ణ సమష్టితి విశ్వసంస్థితిన్!

## 21

జల జల రాల సాగె - అవి
సంపెగలా? విరజాజి మల్లెలా?
అల వియదబ్ధి మౌక్తికము
లా? అమరీ ప్రియ రత్న భూషలా?
కలగిన విశ్వమానసము
కార్చెడి అశ్రువు లవ్వి - రాము నె
చ్చెలి దలపోసి ఆ పొగడ
చెట్టటు మీటగ భావ వీచికల్!

## 22

మానవు డైన రాము డటె
మ్రా నయి, మ్రానుల సానుభూతిలో
మానవుడై, ప్రియానుగత
మానసుడై విచలించి - ఏత దు
ద్యానములో ప్రతీ లతయు
తా నొక సీతగ కన్ను లత్తుకోన్-
ధ్యాన సముద్ర ముద్రు డయి
తా నడయాడెడు మెల్ల మెల్లనన్.

## 23

శ్రీమ దనంత మోదమున

సీతను చూచిన కంట నేడు శ్రీ

రాముని చూచి, అందెవరి

రాగము గొప్పదో తేల్చుకోన్ వన

స్వామితో బాహు యుద్ధముకు

పాల్పడి, తేలక గ్రుద్దు కొందురో

తామె యనంగ చిక్కువడి,

త ద్వన వల్లులు రాము నద్దెడున్.

## 24

ధరపయి నెల్ల శోకమును

తానె ధరించి, అశోక మెల్లనున్

నరుని కొసంగినట్టి కరు

ణామయి తా నిపుడింది లేదు; ఎ

వ్వరి కొరకీ వనిన్ వెదుక

వచ్చెనొ చూత మదృష్ట మంచు సం

బరమున లేచి క్యూ నిలిచె

పాదపముల్-రఘురాము ముందటన్!

## 25

తన తను కాంతులే తనకు
దారులు చూపగ, మేటి తారలున్
కనుగొన రాని చెట్ల తల
కాయలలో దిగి, మూల మూలలన్
సునిశిత దృష్టి జన్పి, పరి
శోధకు నట్లు పరిభ్రమించు రా
ముని కిడు ముజ్జగాలు కయి
మోడ్పులు నిష్కుట కుట్మలమ్ములన్!

## 26

ప్రతి తరు నీడ నిల్చు, ప్రతి
పాదపమున్ తన దివ్య పాదమ్మై;
ప్రతి లత జాడ బోవు, ప్రతి
వల్లికయున్ తన దేహవల్లియై;
ప్రతి విరి వాడ జచ్చు, ప్రతి
కోరకమున్ తన హృ చ్చకోరమ్మై;
క్షితిజను చూచినట్టె ప్రతి
చెట్టును చూచుచు రాము డవ్వనిన్!

## 27

ప్రతి సుమమున్, ప్రతీ లతయు,
ప్ర త్యవనీజము రామచంద్రు నా
స్థితి నట గాంచి, తత్సుభగ
దేహగ తేక్షలు కాగ – పారవ
శ్యతగతి నేరి రం గెవరి
కంటెనొ – పండెను కృష్ణకాటుకల్
క్షితి సతిగా అశోక వన
సీమ మొదల్ అల బృంద దాకనున్!

## 28

తమకును మిత్రు డక్షర సు
ధాకరు డయ్యెనె? సీత పాద ప
ద్మములను కొల్చినట్టి ఫలి
త మ్మొకొ? రాముడు రామచంద్రుడై
తమ కిడె దర్శన మ్మను ము
దమ్మున ఉత్పలముల్ ప్రఫుల్ల ము
గ్ధము లయి కొల్చె రాముని ప
దమ్ములు సన్నిహిత ప్రహ్లాదమ్ములన్!

## 29

ఎచ్చట సీత కూర్చొనెనో,
ఎచ్చట నేలను కేల దువ్వెనో,
ఎచ్చట సీత శోకిలెనో,
ఎచ్చట కన్నులు కాల్వ లయ్యెనో,
ఎచ్చట సీత మూర్ఛిలెనో,
ఎచ్చట స్వప్నలతల్ సుమించెనో,
అచ్చట అచ్చ టచ్చ టచ
టచ్చట రాముడు ఆగి - సాగెడున్!

## 30

చిబుకము దువ్వు, కౌగిటికి
చిక్కు, కపోలము లంటు, కండ్లకున్
కబురులు చెప్పు, కాళ్ళపయి
క్రమ్ము, ఉరమ్మున చిమ్ము, గుండెలో
గుబు లిడు - సీత పాదములు
కొల్చిన త ద్వని నెల్ల పల్లికల్-
గబగబ రామచంద్రు డిటు
గా అటుగా చనునప్పు కోర్కెతో!

## 31

పూచెను చంపక ప్రతతి-
　　భూమి సమస్తము నొక్క నారసిం
హాచల మట్లు; సింహములు
　　మత్త గజమ్ములు, వ్యాఘ్ర రాజముల్
నీచకు పోవగా - నరుడు
　　నిల్చె మహోచ్చను; త త్సుగంధముల్
వీచెను దిగ్దిగంతముల
　　విశ్వ మనుష్య మహోదయ ప్రభల్!

## 32

తమ పని తాము చూచుకొను
　　దైత్యుల మీదన? కాదు, దైత్య త
త్వము పయి దాడి; దేహమును
　　దాల్చిన యెల్లరు జీవితార్థులే;
తమ తెగ మాత్రమే బ్రతికి
　　తక్కిన వారలు చత్తుగాక యన్
కుమతులు కూలరా? పుడమి
　　కూతురు దుర్నయముల్ సహించునా?

## 33

శివ ధను వెత్తి ఎక్కిడుటె
సీతను పొందుట; ముక్క లయ్యె కా
ల వశముచేత నద్ది; ఎవ
రందుకు బాధ్యులు? అంత దానికే
నవ యువ దంపతీ ప్రణయ
నాదము త్రెంచెడునే అపశ్రుతిన్?
ఎవ డది? బ్రహ్మ యన్న యత
డెవ్వడు? ఎవ్వడు ధర్మపీఠిపై?

## 34

రాముడు బ్రహ్మ; బ్రహ్మ యొకొ
రావణుడున్? అగుబో అహర్నిశల్!
రాముడు శ్యామ సుందరత
రాజిలి, రాత్రియు తానె యౌటచే
రాముడె నిండు బ్రహ్మ! ఇక
రావణు డెక్కడ మిథ్యగాక? శ్రీ
రాముని చేరె రావణు డ
రాతి నెపమ్మున ఆత్మ సీతతో!

## 35

శాంతము లేక లోకమున
సౌఖ్యము లేదనినారు పెద్ద; లా
శాంత సమస్త దాస్యుడు ద
శాస్యుడు నేరని వాడె? దుష్క్రియా
క్రాంతికి హేతు వేది? ఎది
త్రావిన తీరని దాహమే కదా?
ధ్వాంతము గొల్వ కాంతి యెటు
దక్కును? చిక్కును శాంతి సౌఖ్యముల్?

## 36

శివు డన నెవ్వ, డే యొకని
క్షేమము కోరిన కుంచితాత్ముడా?
అవనిజ కూడ మ్రొక్కుకొన
దా శివ శక్తికి? తాన యేని తత్
శివగత చిత్తుడౌ కద? వ
శీకృత కాముడు కాని వాని కే
శివుడును లేడు, తత్ చరణ
సేవయు వ్యర్థము; స్పర్థ లేటికిన్?

## 37

రవి శశి తార కాదుల చె

రన్‌గొని సేవలుగొన్న రావణో

ద్భవనము కాటి దిబ్బ అయి

పొద్వడ – పొద్వడి ఇంతదాక నె

ట్టి వెలుగు లేని పేదల కు

టీరములన్ కనిపించు దీపముల్!

పవనజు డైన రాముడు ప్ర

జా సుఖధాముడు కాక యెట్లగున్?

## 38

కాకలు పండి పై కొనిన

కాల మునీంద్రుని గడ్డ మేమొ? వ

ల్మీకము కాదె? రామ విభు

లీలలు కూర్చిన తాళపత్రికా

నీకము నా ననంత రమ

ణీయము, హేమ లతాంత సౌరభ

శ్రీ కమనీయ, మక్షర వ

రీయము, సద్ద్విజరాణ్మహీయమున్!

## 39

గుస గుస లాడ సాగినవి
కొండల గుండెలు తట్టి నిర్ఝరుల్;
రుస రుస లాడ సాగినవి
రోదసిపై ఘన హైమనీ లతల్;
వస వస లాడ సాగినవి
వన్య విహంగము లర్ధ నిద్ర; సా
రస రస ధాము డా విజయ
రాముడు త ద్వని నట్లు సాగగన్!

## 40

హనుమతొ లంక కాల్చినత,
డంబుధి కట్టినతండు, రావణున్
తునిమినతండు - రాముడు మ
నుష్యు డటే? అత డెంత ఒడ్డు పొ
డ్వును గలవాడొ! చూచి కను
మోడ్తుము ధన్యత నంచు రాక్ష సాం
గనలు చరింత్రు త ద్వనము
నన్ త్రిజటా స్వపనమ్ము నెంచుచున్!

## 41

ఆవలి మూల ఆకసము
నంటి తలల్ విదలించు నెవ్వ డా
జీవుడు? రావణుండె పెను
చీకటి నుండి పునర్భవించెనో
లావున? అద్దిరా, పది త
లల్ ముదితాడి! ఇతండురా దురు
ద్రూవుల తాటిపండ్ల వలె
రాల్చె నటం చది రాము మెచ్చెడున్!

## 42

మనుజుని చేత చచ్చు వర
మా ఇడినా వని రుద్రమ్మై, దశా
నను పెనుపీన్గు ఆకసము
నంటినదో నలుమోము పెద్ద పై
కన నది యేమి? ఎల్ల వెలు
గారిన రావణు రాజ సౌధమో?
కనక మణి ప్రదీప ఘన
కాంతులు నిల్చునె ప్రాణ మారినన్!

## 43

ప్రమిదను వెల్గు వత్తి గని,
బా గని చే గొని, ఎత్తి నెత్తిపై
తమి నిడుకొంట - రామ విభు
దారను బట్టి త్రికూట పర్వతా
గ్రము పయి పెట్టుకొంట; అది
లంక కదా? నెలవంక కాదుగా?
శ్రమ నిడు, దుఃఖపెట్టు, తెగ
జంపు స్వశక్తికి మించు కార్యముల్.

## 44

ఏ మొనరించె తాను - తన
యింతి నటుల్ చెరబెట్ట? మోహమున్,
తామసమున్, విదాహమును
తప్ప - దశాస్యుడు స్త్రీ దరిద్రుడే?
కామము కాదు, కట్టె పయి
కట్టెను చేర్చిన హోమ మద్ది! త
ద్ధూమము కళ్ళు కప్పి పడ
ద్రోసిన దాతని మృత్యు గర్తలో!

## 45

అనల శిఖా లతాగ్ర కమ
లామృత బిందు కళా ప్రపూర్ణుడై
తనువును గొన్నదాది - సర
దాకును పాపమును చేయలేదు; స
జ్జన ముని మిత్ర కోటి కెదొ
సాయముచేయ దలంచి తప్ప తా
ధనువును ముట్టలేదు; వల
దా ఒక హేతువు ఎట్టి శిక్షకున్?

## 46

మనుజుడు తాను కూడ; తన
మార్గము నందును పూలు ముళ్ళు క
ల్గును; తన చేతలందు నెవో
లోపము లుండును; కాని - అక్రమ
మ్మొనరిచె నన్న దొక్కటియు
నుండదు రామచరిత్రలోన; స
ర్వ నరుల నొక్క సూత్రమున
రాముని హస్తము కుస్తరించెడున్!

## 47

వాలి వధా విధాన మప
వాదును తెచ్చునొ! మిత్ర కార్య దీ
క్షాళువు తాను; మిత్రునికి
శత్రువు వాలి, త దన్య వన్య యో
ధాళితొ పేచి లేదు, బహి
రంగ రణ మ్మెటుచేయు? ధర్మ సూ
క్ష్మాల నెరింగినట్టి ముని
సత్తము లుండరె నిర్ణయించగన్?

## 48

భూమిజ దాకి అడ్డుకొన
బోయిన లక్ష్మణుతో పెనంగి, తత్
భామిని స్వీయ శూర్ప నఖ
దారిత నాసిక యయ్యె – ఈసుతో
రాముడు ముక్కు కోసెనని
రావణు నున్మదు చేసి చంపె! దు
ష్కామము కాదె లోక సుఖ
శాంతుల కెల్ల వినాశ హేతువౌ!

## 49

స్త్రీ నొకదాని జంపె; ఎవ
రేనియు దుష్టులు వధ్యులే; సుమో
ద్యానము నుండి కంటక ల
తల్ లత లైనను వర్జ్యముల్ కదా?
మానిను లైన కామినుల
మన్నన చేయడె? తా నహల్యకున్
ప్రాణము పోయడే? శబరి
భక్తిని గ్రోలడె? భేద మెంచెనే?

## 50

ఎవ్వరు మానవుల్? గరుడు
లెవ్వరు? ఎవ్వరు దేవదానవుల్?
ఎవ్వరు వానరుల్? శబరు
లెవ్వరు? ఎల్ల రొకే మహద్వనిన్
పువ్వులు కావె? త ద్వివిధ
పుష్ప రసమ్ములు క్రోలి సోల, కీ
త్రవ్వక మేల వ్రేళ్ళు తెగ?
తాను జగ ద్వనమాలి కాదొకో?

## 51

కూర్మి చెలంగ సీత తన
 కోసము పువ్వులు త్రెంచున ప్డెవో
ఊర్మిళ గూర్చినట్టి వ్యథి
 తోహలు స్వాంతము నేచు; తమ్ముడో
ధార్మికు; డిర్వురున్ తన ప్ర
 తాగ్నుల కింధన మైరి; తా జగ
త్కార్మికు, డేమి చేయు? శ్రమ
 తప్పునె ధర్మము నిర్వహించుటన్?

## 52

కైకను కూడ తా ననడు
 కర్కశమౌ నొకమాట; ఆమెయే
లేక త నేమి? అందరి వ
 లెన్ సుఖ ముండెడివా డయోధ్యలో;
లోకము పండునా స్వసుఖ
 లోభులు నిండిన? కర్మ లెండినన్?
శోక లతాంత జన్యములు
 శ్లోక ఫలమ్ములు జీవ కోటికిన్!

## 53

బంగరు లేడి గాంచి తన
భామిని తెమ్మను టేల? వంటకా?
చెంగున నేదొ అస్త్రమున
చేకొని, కేటికి చావ నేసె? ధా
త్రిం గల యేరికిన్ క్రియల
తీరులు కర్మనుబట్టి కాదె? సా
రంగమె అద్ది? భావి రణ
రంగము! కాలపు టంతరంగమో!

## 54

జరుగుచు నుండు నిత్య మెదొ
సంగతి; దానికి మంచి చెడ్డ లే
ర్పరచు జగమ్ము; తక్షణ ఫ
లమ్మును బట్టి స్వలాభ దృష్టితో
నరుడు మెలంగు; మార్పు నిజ
నైజముగా ప్రవహించు సృష్టిలో
వర మెది? వర్జ్య మెద్ది? తన
వర్తనమే తగువర్తన మ్మగున్.

## 55

ఒకనికి మంచియైనది మ
రొక్కనికిన్ చెడు గాను; లోక మం
దొకనికి నీతియైనది మ
రొక్కనికిన్ అవినీతి యౌను; లా
కికమున నైజ మేది? తన
కేది నిజ మ్మది చేసె తాను; మం
చికి తనచేత మంచి, చెడు
చెడ్డకు; బాధ్యుడు రాము డెట్లగున్?

## 56

ఎక్కడి నుండి వచ్చినదొ
ఇంద్రుని వజ్రము వంటి మార్గణ
మ్మొక్కటి రాము కాళ్ళబడె!
ఊ మ్మని పై గల కొమ్మ రోషమున్
గ్రక్కుచు దూకె దాని పయి!
రావణు నాఖరు బాణమున్ అటుల్
స్రుక్క, కృతార్థ మైన తద
శోకము రాల్చె ప్రమోద బాష్పముల్!

## 57

గడిచెను కాల మెంతొ - దశ
కంఠుడు కూలియు, యుద్ధ మాగియున్,
పుడమిజ స్వేచ్ఛ పొందియును,
పొత్తొనగూడియు; కాని - ఇప్పు డె
క్కడి దిది, బాణమా? విషము
కంఠుని ప్రాణము గాక! లంకతో
ఉడివడ లేక గ్రుచ్చుకొని
యున్న దశోకము నింతదన్కనున్!

## 58

నిలువడు రాము డే తరువు
నీడను, ఇంతగ జీవి తోహలన్
కలగడు మున్ను; ఈ విటపి
గల్గు విశేష మ దేమొ! సీతకున్
నిలువగ నీడ యైన అవ
నీజ మశోక మదేనొ? ఔను; శా
ఖల నవి ఆకులా? భువిజ
గాచిన తత్‌వ్రత శక్తి శూలముల్!

## 59

విధిహతు డైన రావణుడు
వెర్రి వికారమె పురుషార్థమై
మిథిలజ డాసి నప్పు డొక
మేరను దాటడు; దాటి యున్న – వే
విధముల నా యశోక తరు
వీర దళమ్ములు రామ బాణపుం
కథలనె మార్చియుండెడివి
గా, సతి శోకపు ధాటి చూపుచున్!

## 60

పుణ్యవతుల్ ధరించు తన
పువ్వులు సీత వియోగ వేదనా
రణ్యక రోదనాశ్రు లయి
రాలగ – నిస్సుమనో విదీన కా
రుణ్యము తానయ్యై, నిలిచి
రూక్ష తపాన, వరాన పొందెనో!
పుణ్యవతుల్ తరించు మధు
వొందె అశోక మరిష్టముల్ చనన్!

## 61

అపకృతి చేసి కాకి అసు
రాధమ మయ్యెను; ఉన్నయంతలో
ఉపకృతి చేసి గ్రద్ద అమ
రోత్తమ మయ్యెను; భేద మంతయున్
అప ఉప లోనిదే; కృతి స
మస్తము జీవి ప్రవృత్తి తోడిదే;
చపలత పాయనో అగురు
శాఖల కాకులు ఆకులై మనున్!

## 62

రాతిని నాతి జేసిన ప
రాత్పరు డాతడు; త త్పదాంకి తో
ర్వీ తలి బీటి దేని చిగు
రించును పుష్ప ఫలాభిరామమై;
చేతము రామ పాద సర
సీ పరిపోషిత నిత్యనూత నో
న్నాతనమై రహించు సుమ
నో విభవమ్మున కేది సాటియౌ!

## 63

రాముని పాదధూళి నొక
రా యెదొ తోయలి యైన దంట, ఏ
లా మనవొ అదృష్ట గతు
లన్ సరిచూచుకొనంగ రాదు? పో
దా మని యాత్ర సాగెడు నొ
త చ్చరణాధ్వము వెంట - మన్గడన్
బాములు వడ్డ జీవు లిరు
ప్రక్కల మూగెడు రాలు రప్పలై!

## 64

తీరని కోర్కెలే ప్రగతి
తీర్థములై తమ వెంట భావనో
త్తీరము లందు మానవుని
త్రిప్పుకొనున్; ఫల మిచ్చు నిత్య దీ
క్షారతి గొల్చు చున్న నొకొ
కప్పు డొకొక్కటి; ప్రాణ గాఢమౌ
కోరిక లేక వెల్గు టెటు
గుండియలో అమృత ప్రదీపముల్?

## 65

రాముడు పోవు త్రోవ కిరు
ప్రక్కల నట్టిటు దూకుచున్న త
ద్ధూమశలాక లా చరణ
ధూళికి ప్రాణముగొన్న రాళ్ళు? ఆ
రామము గాచు వాళ్ళు! రఘు
రాముని తద్వని గాంచి భ్రాంత చి
ద్భూమిక లైన వాళ్ళు! ఎటు
తోచక చీకటి ముస్గు వాళ్ళునున్!

## 66

సీతను చూచి, గుండె మృగ
శీర్షమయూరము కాగ, అంజనా
సూతి మహాప్రభంజనుడె
సూ యన, హెచ్చిన మానసమ్ముతో,
కోతుల దండు రెచ్చి నటు
కొమ్మలు వ్రచ్చిన తోట యద్ది - చి
త్రా తరుణేందు భోగ వన
ధామము య్యైనది రామ సంగతిన్!

## 67

కోతులు పెక్కు లున్న వట,
కొమ్మలపై నెవో మూగి కోర్కెలన్
కూతలు పెట్టుచున్; చిగురు
కొమ్మల మాటున పిట్ట లేవో అ
జ్ఞాత మనోజ్ఞముల్; అది వ
సంతుడె అన్నటు తీగలెల్ల సా
కూతము లయ్యె రాము నెడ;
కోమలముల్ భ్రమరీ రస ధ్వనుల్.

## 68

మిణికెడు తోట నెల్లెడల-
మిణ్గురులా? ఉడు కాంతి తున్కలా?
దినమణి నుండి వేర్పడిన
దీధితి రవ్వల? అంధకార కం
ధిని వెలుగొందు రత్నముల?
నెమ్మదిగా నిలువెల్ల కన్నులై
వనరమ రాము జూచు రుచి
వైఖరులా? అవి సీత చూపులా?

69

శివుని ధనుస్సు నెక్కిడుట,
సేతువు కట్టుట, పంక్తి కంధ రా
ద్యవమతులన్ హరించుట, మ
హాటవులన్ వ్యథ లోర్చు, టయ్యు వి
య్యవి యన నేల - రామ చరి
తాద్భుత కాండము లెల్ల సీతవే!
అవనిజ చుట్టు అల్లుకొని
నట్టివి గాథలు, వన్య వీధులున్!

70

అదె పులి యన్న, తోక అదె
అందురు లోకులు; లోక నైజ మ
ట్టిద యగు; వింధ్య కీవలి త
టిన్ వనభూముల యందు రాజ్యసం
పద నెసలారు ప్రాజ్ఞరుల
వానరు లందురు; నామ సామ్యపుం
బదమును బట్టి పల్కుదురు
వానరు మర్కటు డంచు నేరమిన్!

## 71

ఈ వనజాతులం దొకొక
డింద్రుని మించిన వాడు; వాలి, సు
గ్రీవుడు, జాంబవంతుడు - హ
రీంద్ర గిరీంద్రులు; శాస్త్ర శారద
శ్రీ విభవుండు నీలుడు, సు
షేణుడు; పావని సర్వజీవ సం
జీవని; వేలు లక్షలు వ
నీ జన యోధులు దండకాటవిన్!

## 72

సీతయు లక్ష్మణుండు తన
జీవిత దృష్టికి రెండు కళ్ళు; తత్
సీతకు ప్రాణమిచ్చి, రణ
సీమను కూలిన లక్ష్మణున్ పున
శ్చేతను జేసి - అంధతమ
సీ పరిశూన్యము నుండి ఎవ్వ ర
బ్బా, తన నుద్ధరించగల
బంధువు వాయుసుతుండు తక్కినన్?

## 73

వాయుసుతుండు వీర రస
వార్ధి, సమస్త విభూతి యోగ ని
శ్రేయసు, డాత్మ పాద సర
సీరుహ చిత్తుడు; సాహితీ లతా
గాయన మూర్తి; ఆతని ము
ఖస్థ సరస్వతి కాదె సీత బా
ధాయత గాథ పాడి తన
ప్రాణము నిల్పిన దిన్ని నాళ్ళునున్?

## 74

వేదము లందు మొల్కగొను
విద్యలు పెక్కులు దక్షిణాదినే
హ్లాద మనో మనో రమము
లై వికసించెను; పూర్ణ జీవనా
స్వాదన వైభవమ్ము వన
జాతుల సొంతము; తక్కువారలన్
లే దది; నిత్య జీవన శి
లీముఖ వేగము భోగ మెట్లగున్?

## 75

మాతువు ధాతువున్ పరమ
మైత్రి నుమా శివ తత్వమై రసా
ద్వైతము కాగ, బ్రాహ్మి పద
భాగుడు పావని కంఠ మెత్తి, శ్రీ
సీత కథన్ వచించు వన
సీమలు - కాలము నిల్చిపోన్ - సదా
శీతు విషణ్ణ బాష్ప పరి
శీర్ణము లైనవి త న్నిశీథులన్!

## 76

మావులు పూచె, నల్దిశల
మంచు తెరల్ విరబారె, సంపెగల్
తావులు చల్లె, బర్హితతి
తాండవ మాడె, నగెన్ శరత్కళల్-
భావము జానకీ వదన
పద్మము చుట్టు పరిభ్రమించి శో
కావిలు డైన రాముని ప
దాబ్జము చుట్టు పరిభ్రమించుచున్.

## 77

సుందర సుందర ప్రణవ
సుందర సుందర సౌమ్య సౌహృదా
నంద రతీందిరుండు రఘు
నందను డా విపినేందిరా మనో
మంద రసైందవీ ప్రణయ
మందిరుడై విటబో నటన్ నవం
దిందిర బృందమై పరుగు
దెంచు స్మృతుల్ క్షితిజా గత శ్రుతుల్.

## 78

పది పది రెండు వర్షములు
పట్టపు రాణిని మించి - శైలజన్,
ఉదధిసుతన్, సరస్వతిని
ఓజము లన్నిట మించి - ఉర్వరా
హృదయ సరోజ జానకి అ
యోధ్యను మన్నన లందదే? శుభా
భ్యుదయ సుధా ప్రవర్షిణిగ
ఉన్నతు లందదె పౌరకోటిచే?

## 79

ఏ యుదయమ్ము కా యుదయ
మే మణి మౌక్తిక రమ్య హేము కా
శేయ వినూత్నయై విరియు
సీత హఠాత్తుగ ఒక్కసారి ఝుం
ఝూయత ధాటి చిక్కిన ర
సాలిని యైనది నార చీరలన్!
మాయవు నేటికిన్ తన మ
నస్సున త ద్దయనీయ దృశ్యముల్!

## 80

నింగిని బోవు నా శశిని
నేలకు రమ్మని పోరుపెట్టి, కో
టం గల యెల్లవారల యె
డందలు తట్టెను తాను మున్ను; నే
డంగన మోమునన్ నిలిచి
ఆ నెల కౌగిట వాల – రాహువై
మ్రింగి దశాననుండు; కరి
మ్రింగె సమస్త ఫలమ్ము దుర్విధిన్!

## 81

పుట్టిన దాది (ఎట్టులుగ
పుట్టెనొ!) అట్టులె ఆరు వర్షముల్
మట్టిన ఉండి (ప్రాణ మెటు
లాడెనొ!) ఆరు రసాలకున్ తనే
పుట్టిన ఇల్లుగా (త దను
పూర్వము పృథ్వి రసార్ద్ర కాదొ!) చె
న్నుట్టిపడంగ సీత వెల
యున్ జనధాత్రికి అన్నధాత్రియై!

## 82

నిజమున కామె రమ్య రమ
ణీకృత షట్ ఋతు రామలీల, స
ర్వ జగము నామె హేల; మధు
రాగము, శ్రావణి కోల్బణమ్ము, పౌ
షజ హిమధూమమున్ సమ ర
సమ్ములె ఆమెకు; రత్న కంబళుల్
అజినములొక్కటే యగుగ
దా పరిపక్వ రసానుభూతికిన్?

## 83

పట్టపురాణి కావలసి,
పంచవటిన్ కటు వల్కలమ్ములన్
గట్టి వసించి, సౌమ్య వన
ఖడ్గ విరాధు కబంధ హస్తపుం
బట్టు సహించి కూడ – శర
భంగుని కానల హింస మాను మ
న్నట్టిది సీత! దైత్య వధ
కర్థము లే దని మొత్తుకొన్నదే!

## 84

మోసముచేసి సీత గొని
పోయిన రావణు కంటె గొప్ప రా
కాసుడు పో విరాధుడు! ము
ఖాముఖి రాముని త్రోసి, చంకలో
వేసుకపోయె మైథిలిని!
వీరు డుదారు డతండు! అంత ఘో
రాసుర రూపుడున్ బుడుత
డై చనె తల్లిగ సీత నిల్వగన్!

## 85

చిన్నట విశ్వమిత్ర ముని
        చెప్పిన పక్షపు మాట తప్ప, ఏ
మున్నది కారణ మ్మసుర
        ముఖ్యుల ద్రుంపగ? వన్య భూములన్
దున్నుక శాంతిమై బ్రతుకు
        దోర్బలులన్ తను రెచ్చగొట్టెగా!
చిన్న దె యైన గాని తన
        సీతయె సత్యము వాస్తవస్థితిన్!

## 86

సహజముగా ప్రపంచమున
        సత్వము కంటె రజస్తమమ్ములే
బహు బలవంతముల్; సృజన
        వర్ధిల, చేతన ప్రస్ఫుటించగా
విహితము లవ్వె – కాన, జన
        వేద్యము, లర్చ్యము లవ్వె; కాననే
అహ మటు రాత్రియున్ సమ ని
        యంత్రితమౌ! ప్రణయ ప్రతీతమౌ!

## 87

కాంచన కాంచి దిక్పరిధి
గా, పరిగుంఫిత మౌక్తికేద్ధ చే
లాంచలమే ఉషఃప్రభగ,
హ్లాద మనోజ్ఞ నవారుణాంబర
ప్రాంచిత కాంతి రభ్యుదయ
రాగముగా – ప్రతి రెప్పపాటు రో
మాంచము నించు సీత సతి
మాత్రమె? జీవజగత్ చిదాత్మమే!

## 88

భూసుత ఒక్క నాడు, వన
భోజనకేళి, స్వ హస్త పాకమున్
భాసురలీల వడ్డన మొ
నర్చి, తదార్ద్ర సుగంధ హస్తమున్
బాసట నున్న భూరుహము
పై నిడి నిల్వ, తదీయ గంధ మో
వీసము సోకి కాదె కరి
వేపగ అయ్యది నిల్చె నేటికిన్!

## 89

కోమల మౌచు, సీత జడ
　　కుచ్చులుగా అభిధన్ ధరించి, సౌ
దామని ధార లట్లు వన
　　ధాత్రిని నిండిన తీగ లేమి? భృం
గామల కాళి దువ్వి నవు
　　డా కొనగోళ్ళకు చిక్కుకొన్న తత్
భూమిజ కేశ లేశములు
　　పో? రసకందము, లాత్మ విందముల్!

## 90

రేఫ రథమ్ము నుండి పలు
　　రీతుల సీతను జూచి చూచి, సీ
తా ఫల మయ్యె తానె ఒక
　　తారక; రాముని జూచి చూచి, రా
మా ఫల మయ్యె తాను నొక
　　మల్లిక; తద్వయి జూచి చూచి, ము
క్తా ఫలమై రహించు ఎద
　　కల్గు ప్రతీ ఫలమున్, ప్రసూనమున్!

## 91

తెల తెల వారు జాముల క్షి
తీ సుత తానె ఉషఃకుమారి నాన్
అలరుల తోటలన్ దిరుగు
నప్పుడు, కొమ్మల జిక్కు నామె వ
ల్కలముల వల్కముల్ మనసు
గైకొని నట్టివి సీతకోక చి
ల్కలు! మధు ముగ్ధ మోహనము
లై విహరించును వన్నె చిన్నెలన్!

## 92

చిరు చిరు పూలపై చిర రు
చి స్ఫురణమ్ములు రేగి, గుండెలో
చిర చిర లాడ – ఏ ప్రణయ
ఛిద్రములం బడి తేలివచ్చునో
చిర విరహ స్ఫులింగములు!
సీత విదల్చిన బాష్ప భూషలో?
చిరు చిరు ముల్కులై మనసు
చీల్చుచు నున్నవి రాము నా నిశన్!

## 93

ఎవ్వతె సీత? రాము డన
నెవ్వడు? ఎవ్వడు రావణుండు? ఈ
ముమ్మురి మధ్య నున్న ఘన
మోహము లెట్టివి? సృష్టి నైజమో
ఇ వ్విధి జోక్యముల్? అపక్ష
తీర్పులు? ధర్మవిరుద్ధ యుద్ధముల్?
పు వ్వటె ప్రేమ – త్రెంచుకొని
పోవగ? ప్రోవగ? పారవైవగన్?

## 94

గంగను దాటి ఇద్దరిని
కాలిడి నప్పటి నుండి, కాలి దో
యిం గనుదోయి పెట్టుకొని
యే సురనిమ్నగ సీత నంటి వ
చ్చెం గహనమ్ములన్; జరత
శేవల మైనది పర్ణశాల; తత్
గంగయు దాటి, విష్ణు పద
కంజములన్ శివలంక ముంచెబో!

## 95

గౌతమి, కృష్ణవేణి పద

కంజములై - అల చిత్రకూట శో

భా తలి నుండి, పంచవటి

ప్రస్రవణమ్ములు దాటి, ఏ మహేం

ద్రీ తటినీ మతల్లి ధర

ణీజకు తోడయి వచ్చె - ఆమె వా

కాతర దృక్తరంగము లి

కన్ జయకొట్టెడు నబ్ధి గుండెలన్!

## 96

పది తల లున్న వాని నొక

బాణమునన్ తునుమాడి, భూమికిన్

పదిలము కూర్చినట్టి జన

బంధువు రాముడు మేరుధీరుడౌ

కద! కను దమ్ములా, అరుణ

కందములా అవి? ఔను! తప్త హృద్

హ్రదములు తప్ప కా వెవియు

రాముని దేవికి స్నాన యోగ్యముల్!

## 97

శ్రుతి హితముల్, హిత ప్రణయ
సుందరముల్, సుహృదేక చింత నాం
చిత శివముల్, సమిష్ట రస
సింధు ప్రియేందు కళోద్ధ కాముమో
హితములు - తద్వనిన్ వెలయు
హ్రీలును, శ్రీలును; కాని - తాను ని
ర్జిత సకలేంద్రియుండు! జన
జీవన శీలుడు! లోలు డెట్లగున్?

## 98

చనె పదునాలుగేండ్లు, ఒక
చైత్రము త మ్మెడబాపు దన్కనున్
క్షణ మటు; శేష మొక్క క్షణ
కాలమె లక్షల వత్సరమ్ములై
కనలిచె దుర్వియోగమున;
కన్నులు కాయలు కాసె సీతకై;
తను వటు వేగ, ఏల మతి
దగ్ధ మగున్ ఎవో ఏవొ శంకలన్!

## 99

తన వలె సీత కూడ శప
    థ వ్రత యౌనొకొ? ఐన నేల తత్
కనక కురంగ మందు తమ
    కమ్మును చూపెను? లక్ష్మణుండు గీ
సిన గిరి దాటి రావణుని
    చేతికి చిక్కెను? ప్రేమ ముగ్ధమౌ
మనసు మధూదయమ్మనను
    మార్గము తప్పునె? మత్తు గప్పునే?

## 100

తడవగరాదు కాని – తన
    తండ్రియు నిట్లె యొనర్చి యాతనల్
పడె; అది వేరె గాథ; తన
    పట్లను దాపరికమ్ము పెట్టి ఈ
ఇడుములు తెచ్చె; కైక సుతు
    డే కద మాటకు విల్వ కల్గినన్
పుడమికి భర్త? పుత్ర గత
    మోహము న్యాయము కంటె గొప్పదో?

## 101

మోహము, స్నేహముఁ, బ్రణయ
　　మున్ మధుమోహన సుప్రభాత దా
సోహము, మత్త మానస ర
　　సోహము, ఉజ్జ్వలతా ప్రవృత్తి సం
దోహము; ప్రొద్దు సాగి, అరు
　　ణోదయ రాగము మాసి, మిట్ట మ
ధ్యాహము మండి నప్పుడు క
　　దా కనిపించును జీవి నై జముల్!

## 102

భరతుడు మంచివాడు: బల
　　వంతుడు; రాముని పట్ల భక్తి త
త్పర మతి; రాజ్య భార గత
　　బంధ విరక్తుడు; లోక మానస
మ్మెరిగిన వాడు; ఆత డొక
　　యించుక ముందె గ్రహించియున్నచో
వరముగ తల్లి నుండి కొని
　　వచ్చి ధరాస్థలి నన్న కీయడే?

## 103

జనకు డదేల సర్వమును

సర్వుల నుండియు దాచి, గప్పు చ

ప్పున యువరాజు జేయ తల

పోసెను! కాని, రహస్య మెట్లు దా

గును? అది గాక, తా నయిన

కోరెనె రాజ్యము? కొంప మున్గెనే?

తనయుల నైజముల్ కనరు

తండ్రులు, కుందుదు రర్థలోభులై!

## 104

పాదము లందు వ్రాలి, పర

పాదుకలన్ గొనిపోయి, రాజ్య ల

క్ష్మీ దరహాస ముగ్ధముల

జేసిన మానవు డొక్కడుండెనే?

మేదిని నెవ్వడేన్ పదవి

మీద గలట్టి తమిన్ త్యజించెనే?

సోదర మాత్రుడే? సుగుణ

సూర్యుడు పో భరతుండు చూడగన్!

105

నిప్పును బోలు నీతి, పని
 నేర్పు, నిజాయతి కల్గు భూమిలో
చెప్పులు కూడ రాజ్యమును
 చేయగ జాలును; రాజదర్పమే
గొప్పయు కాదు; సార్వజని
 కోన్నతికై కృషి సల్పినప్పుడే
చిప్పిలు మానవాత్మ కల
 శిన్ మధువుల్, మధురోప భోగముల్.

106

అనుభవు డౌటనా? భరతు,
 డక్కర లేకన? రాజ్య మన్న కి
చ్చెను? అది కాదు; రాముడు వ
 శీకృత భూముడు, ధార్మికుండు కా
వున; అది నాడు; నేడు పర
 పూరుష నిర్జిత భార్యు డౌటచే
అనఘత పోయి, పట్టి నరు
 డయ్యెను! తా నిక మాన్యు డేరికా?

## 107

దేహము కాని సీత, పర
దేవతె తానగు సీత పట్ల సం
దేహము పాపమే యగుట
తెల్లము; ఐనను, లోక మె వ్వవో
ఊహలు చేయు; స్వచ్ఛతను
ఓర్వదు; స్వీయ గుణ ప్రమాణమై,
మోహిత బుద్ధి యై పరుల
బోల్చును; వేల్చును ఔను కాదు లన్!

## 108

సత్య మసత్య మం చెరుగ
జాలదు లోకము, సర్వదా పర
ప్రత్యయనేయ బుద్ధి; అది
వాలు నసత్యము వైపె నిత్యమున్;
సత్యము నమ్ము లోక మొక
శక్తి పరీక్షనె; లోక ప్రీతికై
ముత్యము వంటి జానకిని
ముంచునె తా నన దగ్ని కీలలన్?

## 109

పది నెల లాత్మ నుంచుకొని,
ప్రాణములన్ దనియించి, పెంచుకొ
న్నది కద సీత? దీర్ఘ విర
హాంబుధి తీరి, తటమ్ము చేరుకొ
న్నది కద? ఎప్పు డెప్పు డను
నాత్రము నే కులగోత్ర మడ్డుకొ
న్నదొ, రఘురాము నిండు హృద
యాన నెదో బడబాగ్ని రేగెడున్!

## 110

పంచవటంపు సీతకును,
పంక్తి ముఖ వ్యధితంపు సీతకున్
ఇంచుక భేద మేని సహి
యించదు చిత్తము; రామ భావనో
చ్చంచల చంచ లాంచల శ
తాంశము లందును లేదు ద్వైధి; ప్రే
మించిన సీతయున్, పరిత
పించిన సీతయు నొక్క రూపెయౌ!

## 111

నాతియె సీత? నిశ్చల స

నాతని; సాకృత బ్రహ్మ విద్య; ధీ

శ్వేత; అనాది; ఆమె రఘు

శేఖరు ప్రస్థితికే ప్రబుద్ధ సం

కేతము; సీత పట్ల తన

కేమిటి వంక? అదంతె; కాని – సా

కేత జనాళి శంక తొల

గించక లంకను గెల్చిన ట్లె టొ?

## 112

ప్రణయము క్రొత్తదా? హృదయ

భాండము ఉత్తద? రెండొ మూడొ దు

క్షణములు బాధపెట్టినను

సైచి, పరీక్షకు నిల్వగా వలెన్;

రణములు, రంధి రంపులును

రచ్చల కీడ్చుటె రాజవృత్తి; ఏ

అణువును లేదు సొంత మగు

నట్టిది రాజుకు రాజ్య పద్ధతిన్!

## 113

హల్య అహల్య భేద మణు
　　వైనను కల్గదు, కాంత లెల్ల కా
నల్యలె; సీత కూడ తన
　　స్వాంతము నం దొక లోకమాత; ఏ
చెల్యలి కట్ట యైనను కృ
　　షిన్ నియమించెడి సాధనమ్మె; సా
ఫల్యము జీవి శ్రేయము; వి
　　పర్యయముల్ విధి చేతి శిక్షణల్!

## 114

ఎవ్వడు మానవుండు? విధి
　　యెవ్వడు? ఎవ్వడు రాక్షసుండు? తా
నెవ్వ డిలన్ గుణాగుణ ప
　　రీక్షకు పూనగ? ప్రాణి ఎంతగా
క్రొవ్విన అంతగా తరిమి
　　కొట్టును కాలపు వేటగాడు; ఈ
పువ్వుల తోట నిత్య మధు
　　పూరము, క్రోలక కూల్చుకొందురా?

## 115

"చీకటి విచ్చె, ఇంక రఘు
శేఖర సూర్యుని పాద పద్మ ప
ద్మాకర మౌదు" నంచు తమి
మై మనియుండిన సీత – తా నటన్
లేక, విదారి తాత్మ సర
ళిన్ ఎటు లేడ్చునో! ఎంత క్రుళ్ళునో!
లోకపు తృప్తికోస మిటు
లుర్విజ నేచుట ధర్మమౌనటో?

## 116

రావణు నంటుతో ఉసురు
రాలకపోయెను; లంకలోననున్
పోవకపోయె ప్రాణములు;
పుణ్య చరిత్రుడు రాము డెప్డొ రా
డా? విడిపింపడా? మనుప
డా? అను నాత్రమునన్ తపించు త
ద్దేవి సహించునే? సురుగ
దే? రఘువీరు డుపేక్ష చేసినన్?

## 117

మానుష రాగ భోగము స
మస్త మయోధ్యకె అంకితమ్ముగా
సూన శరుండు కూరిచిన
సుందర గాథ సమాప్తమయ్యె; ఉ
ద్యానము దాటి మన్గడ మ
హాటవులన్ ప్రవహించె; బాధ్యతా
ధీనముగా పరార్థ శర
ధిన్ బడున ష్టహా మోహ బంధముల్?

## 118

సీతను తా నెరుంగడె, వ
శీకృత చేతను? యోగ రాగ భూ
మాతను? మర్మవేద్య యగు
మంత్రజ ఆమె; స్వతంత్ర నేడు; ఖ
ద్యోత విభాత కాంతి సక
లోర్వికి మార్గము చూప నిమ్మ; ఏ
లా తన యింటి వెల్గు జన
మంతకు చీకటి మ్రూల్గు కావలెన్?

## 119

శ్రావణ సంధ్యలై కురియ
సాగిన కన్నులలో శరద్ద్యుతుల్
భావ విశేష పర్వములు
పండుగ, రాముడు లోక తార కో
జ్జీవన దీప్తి నంది, విర
జిమ్మెను చుట్టును మాధవోస్మినీ
శ్రీ విలస ద్విభాత రవి
రేఖలు దృ క్కశిరేఖ లక్కటన్!

## 120

ఒక సతి, ఒక్క మాట, శర
మొక్కటి - ఇయ్యవి మూ డొకట్లు; ఇం
దొకటియె చాలు మానవుని
ఉన్నతు జేయగ; మూడు నొక్కటై
వికసన మందు మానవుడు
విశ్వ సమున్నతు డేల కాడు? అం
దుకె పరిపూర్ణుడై జన మ
నో రము డయ్యెను రాము డెంతయున్!

## 121

వ్రత మొక టున్న, దాని కొక
వర్తన ముండును; మార్గ ముండు; ని
శ్చిత మతి యైన మానవుని
చేర్చును లక్ష్యము తత్వ్రతప్రభల్;
సతి పయి ప్రేమ, వాక్కు పయి
శ్రద్ధ, స్వశక్తి పయిన్ ప్రభుత్వ, మీ
త్రితయము కల్గు జీవుడు ధ
రిత్రి నెవాడును రామ దేవుడే!

## 122

మహిజ మనోవ్రతాన పది
మాసము లున్నది; తద్వనీ మనో
మహిముడు రామభద్రు డట
మైగొనె తానును; స్వప్న లీలలన్
మహి పడి మున్గియుండె; వన
మాత్ర మటో? అది మానవాత్మకే
విహిత రసేద్ధ జీవన భ
విష్యము కాదట? శోభ కా దటో?

140895

Complete works of Boyi Bhimanna - Vol-2 Poems - Part -1

